
ఈ వారం తెలుగు పుస్తకం

# పాతిక పుస్తకాల పెట్టు 'తెలుగు కథకులు-కథనరీతులు'

## నాలుగో సంపుటం

చీకోలు సుందరయ్య




**Title:** Telugu Kadhakulu:Kadhana Reetulu-4
**Author:** Singamaneni Narayana
**Subject:** LITERARY CRITICISM
**Year of Publication:** 2004
**Price:** USD $ 2.31

ఏ పుస్తకాన్నయినా చూడాలనో, చదవాలనో, కొని చదవాలనో అను కోవడానికి ఎవరి ప్రాథమ్యాలు వారికి ఉంటాయి. తెలుగు సాహిత్యం ...అందులోనూ కథా సాహిత్యం పట్ల ఏ మాత్రం అభిరుచి ఉన్నా కథల సంపుటాలు, సంకలనాలు సేకరిస్తారు. చదువుతారు. ఆనందిస్తారు. వీలయితే పదిమందికి చెబుతారు. ఇదంతా సాధారణ పాఠకులు చేసే పని. రెండో తరగతి పాఠకులు కథలు మాత్రమే చదివి ఊరుకోరు. కథా సాహిత్య చరిత్రను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఆయా కథకుల కథన రీతుల్ని గుర్తిస్తారు. కథా వస్తువును ఎన్నుకోవడానికి దారితీసిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిజ్ఞానం ఏ మేరకో అంచనా వేస్తారు. మరికొందరు ఇంకొంచెం ముందుకు వెళ్ళి ఆయా కథకుల దృక్పథాలను, తాత్త్విక కోణాలను అవగతం చేసుకోవడానికి కృషి చేస్తారు. అంతేకాదు ఆ కథకులు ఎవరి పక్షం నిల బడుతున్నారో కూడా చెప్పగలుగుతారు. ఇదంతా వారివారి చైతన్యం మేరకే చేయగలుగుతారు.

"తెలుగు కథకులు - కథనరీతులు" నాలుగు సంపుటాలు, వందమంది కథకుల గురించి, మరో వందమంది ఏమనుకుంటున్నారో తెలియచేసిన అద్భుత ప్రయత్నం. ఈ పరంపరలో వెలువడ్డ తొలి రెండు సంపుటాలు అమ్ముడయిపోయాయి. యిప్పుడు మార్కెట్టులో 3,4 సంపుటాలు మాత్రమే లభ్యమవుతున్నాయి.వాటిల్లో నాలుగో సంపుటం గురించి కాస్త వివరంగా చూడడమే ఈ సమీక్ష సారాంశం.

కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత, ప్రసిద్ధ విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య ఇటువంటి ప్రయత్నం ఏ భాషలోనూ జరగలేదంటున్నారు. అది సరే! *విశాలాంధ్ర* తప్ప మరో సంస్థ దీన్ని చేపట్టలేదన్నది మాత్రం వాస్తవం! ఈ సంపుటాలు అత్యంత నవ్యంగా రూపొందడానికి కారకులైన మన మధురాంతకం రాజారాంని స్మరించుకోవడం మన కర్తవ్యం. వారి తపనకి అక్షర రూపం కలిగించిన సింగమనేని నారాయణ ఈ సందర్భంగా అభినందనీయులు.

ఈ నాలుగవ సంపుటిలో 25 మంది కథకుల పైన వ్యాసాలున్నాయి. దాదాపుగా వయసుల్ని బట్టి ఎన్నుకున్న ఈ కథకుల వరుసలో మొదటి రెండు వ్యాసాలు మాత్రం యిదివరకు సంపుటాలలో రాయించడానికి కుదరక, యిప్పుడు కుదిరిన వ్యాసాలున్నాయి. ఈ యిద్దరు కథకుల్ని కూడా చేర్చడం వలన - కాలక్రమం తప్పినా - యీ సంపుటాలకు నిండుదనం వచ్చింది. వాటిలో మొదటిది 'శారద' పైన సురేష్ రాసిన వ్యాసం. 'శారద' అన్నది తమిళనాడులో జన్మించిన ఎస్.నటరాజన్ కలం పేరు.1937లో తెనాలి చేరుకుని వారాలు చేసుకుని తొలి రోజులు గడిపారు. జోలెపట్టి దేవాలయాల వెంట తిరిగారు. హోటల్ పనిలోకి దిగి అందులోనే కొనసాగి, నిత్యదారిద్ర్యంతో, మూర్ఛరోగంతో ముప్పై ఒకటో సంత్సరంలోనే కన్నుమూసారు. తెలుగు నేర్చుకుని 1946 లోనే "ప్రపంచానికి జబ్బు చేసింది" అనే కథ రాశారు. అప్పట్నించీ వందకు పైగా కథలు, అపస్వరాలు, మంచిచెడూ, ఏది సత్యం, చీరటి తెరలు, మహాపతి, అందాలదీవి, చదరంగం, సందేశం, నాగరీకుని ప్రేమ, కార్యదర్శి, హోటల్లో శవం వంటి నవలలు రాశారు. సమీక్షకులు సురేష్ శారద రాసిన కథల్ని స్త్రీ వాద కథలు, రాజకీయ కథలు, ఉద్యమ కథలు, ఫాంటసీ కథలు, కుహనా విలువల్ని విమర్శించిన కథలు అంటూ వర్గీకరించి విశ్లేషించారు. అలాగే శారద తెలుగు స్వతంత్రలో రాసిన 'క్షణంలో సగం' అనే రాజకీయ సామాజిక వ్యంగ్య రచనల్ని స్పృశించారు. "స్థూలంగా చూస్తే వస్తువు ఎంపికలో ఎంతో విస్తృతినీ, శిల్పంలో మరింత వైవిధ్యాన్నీ ప్రదర్శించాడు శారద. తన రచనలన్నింటిలోనూ, ఈ లక్షణం వల్లే ఆయన పరిణతి సాధించిన కథకుడిగా, నవలాకారుడిగా, తత్త్వవేత్తగా, దార్శనికుడుగా కన్పిస్తాడు" అంటూ సురేష్ , శారద తన రచనల్లో చేసిన సునిశిత వ్యాఖ్యలు, వ్యంగ్య ధోరణిని వివరించారు. ఈ వ్యాసంలో శారద బాల్యం నుంచి మృత్యువు వరకు సాగిన మలుపులతో పాటు ఆయన కథల్లో చోటుచేసుకున్న కాల్పనిక వాతావరణాన్ని, ప్రజల ఆకాంక్షలను, స్త్రీ వేదనల్ని, సంవేదనల్ని సురేష్ రేఖామాత్రంగా చిత్రించారు.

సీనియర్ రచయిత్రి ఐ.వి.యస్. అచ్యుతవల్లి రచనలపైన డా.కె.బి.లక్ష్మి రాసిన వ్యాసం రెండవది.(ఇరంగంటి శేషఅచ్యుతవల్లి) 'జగతి' లో వచ్చిన తొలి కథ కన్నా 'భారతి'లో ప్రచురితమైన 'దీపరాగం'కథకురాలిగా వల్లికి మంచి పేరు తెచ్చిందంటారు వ్యాస రచయిత్రి. ఆమె రాసిన 400 కథల్లో "మూగవోయిన ప్రకృతి, అవ్యక్తాలు-మనస్తత్వాలు, బాత్ ఏక్ రాత్ కీ, నాగావళి నవ్వింది, అచ్యుతవల్లి కథలు" వంటి సంపుటాలలో లభ్యమవుతున్నాయి. ఇదెక్కడి న్యాయం, సీతకలలు, కొడిగట్టిన దీపాలు, తీరంచేరిన కెరటం, భ్రమరగీతం, పుట్టిల్లు, కానుక, కోరిక, ఏకాంత వంటి 19 నవలలు రాశారు. రేడియో ప్రసంగాలు చేసారు, నాటకాలు రాశారు;వ్యాసాలు రాశారు. కాలమిస్టుగా పత్రికల్లో రాశారు. అన్వయక్లిష్టతలేని సరళసుందరమైన శైలి ఆమెది. ఆచార సంప్రదాయాలను మన్నిస్తూనే అభ్యుదయ పంథాలో నడిచే కథనం ఆమెది. కాలానికి తట్టుకుని నిలిచే కమ్మని కథలు రాసిన రచయిత్రి అచ్యుతవల్లి అన్న వ్యాస రచయిత్రి అభిప్రాయంతో ఎవరికైనా ఏకీభావం కుదురుతుంది.

"ముదిగంటి సుజాతారెడ్డి సృజనాత్మక వ్యక్తిత్వపు వేర్లు తెలంగాణ గడ్డ రైతుకుటుంబంలో ఉన్నాయని అంటారు తమ్మల రామకృష్ణ. 'విసుర్రాయి, మింగుతున్న పట్నం' అనే రెండు కథా సంపుటాల్లో ఉన్న ముప్పై అయిదు కథల్లో చాలా వాటిల్లో స్త్రీప్రధాన కేంద్ర బిందువు. స్త్రీ జీవితాల చుట్టూ పరచుకొన్న కష్టాలు, కడగండ్లు,.... హింస, అణచివేత, వేధింపులు, వివక్షలు, దైర్జన్యం, స్త్రీల జీవితాలను ఎలా దుర్భరం చేస్తున్నాయో రామకృష్ణ

సోదాహరణంగా విశదీకరించారు. అలాగే తెలంగాణలో ఎంత బాధ, గోడు, ఆర్తి, దుఃఖం, ఎన్ని కష్టాలు, కన్నీళ్ళు, చావులు జీవితాల్ని అతలాకుతలం చేస్తున్నాయో వాటిని ఆమె ఆర్ద్రంగా చిత్రీకరించారంటారు. రామకృష్ణ, సుజాతారెడ్డి కతల్లో ఉన్న ఇతివృత్తాలపైనే దృష్టి సారించారు. ఆమె కథనరీతులను, వ్యక్తిగత జీవిత విశేషాలను చాలా తక్కువగా స్పృశించారు.

బోజగా ప్రసిద్ధులైన బోయ జంగయ్య పైన బి.ఎస్.రాములు రాసిన వ్యాసం బోజ జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యాల సమాహారం 'బోజకథల్లో యాభయ్యేళ్ళ సామాజిక పరిణామాలు చిత్రితమయ్యాయి.ప్రతి కథలో వస్తు వైవిధ్యం కనిపిస్తుంది' అనే రాములు, బోజ రాసిన గొర్రెలు, దున్న, ఎచ్చరిక, తెలంగాణ వెతలు వంటి రచనలను ప్రస్తావించారు. బోజ కథలు 'దొంగలు, చెదలు, కుండ బద్దలు కొడత, నా పేరు రాయొద్దు, వాయిదా పడిన కేసు, నిజం, అవసరం, మరుగు మందు, మరమరాలు, కరెంటు కథ, సాలిని, చేపల చెరువు, రంగులు, బొమ్మలు వంటి కథల్లో అట్టడుగు వర్గాల వారు, గ్రామీణులు పడే బాధల్ని బోజ ఎంత ఆర్ద్రంగా చిత్రించారో రాములు వివరించారు. బోజకు ముందు తెలుగుసాహిత్యంలో గ్రామీణ జీవితం ఎంత చిత్రించినప్పటికీ బోజ చిత్రించిన జీవితాలు, కోణాలు, దృక్పథం అపూర్వమైన వంటూ రాములు వాటిని ఉదహరించారు. దేశీయతలో అలరారే శిల్ప చాతుర్యంతో బోజ తెలుగు సాహిత్యానికి అంతదాకా లేని విస్తృతినీ, వ్యాప్తినీ కలిగించారంటారు బి.యస్.రాములు.

"ఆలోచింప జేసే కథలు రాసిన కొత్తతరం కథకుల్లో పేర్కొనదగిన కథకులు ఏ.వి.రెడ్డి శాస్త్రి గారు" అంటూ ప్రారంభించిన సమీక్షకులు కోడూరి శ్రీరామమూర్తి, అస్తిత్వ వాద దృక్పథాన్ని జీవితంలోని అసంబద్ధతను ఆవిష్కరించిన కాఫ్కా, కేమూల వలన రెడ్డి శాస్త్రి ప్రభావితులయ్యారంటారు. రెడ్డి శాస్త్రి కథలు "ఇజాలు-నిజాలు, లైబ్రరీలో, స్టాఫ్ రూమ్‌లో, నాగావళి నవ్వింది" వంటి వాటిని తీసుకొని కోడూరి లోకంలోని అసంబద్ధతను ఎలా చిత్రించారో చూపారు. దారిద్ర్య సమస్యకు గల మూల కారణాలు, మనుషుల్లో పెరగిపోతున్న వాణిజ్య ప్రవృత్తి, పీడనా ప్రవృత్తి, సన్నకారు రైతులు, గిరిజనులు పడే కష్టాలను రెడ్డి శాస్త్రి తన కథల్లో చూపారని విశదీకరించారు. రెడ్డిశాస్త్రి ఆంగ్లోపన్యాసలకులు కావడం వల్ల ఆంగ్లభాషా బోధనలో చోటు చేసుకొంటోన్న దిగజారుడు ధోరణుల్ని తన కథల్లో చిత్రించారంటారు కోడూరి. 'సందిగ్ధ సంధ్య, దివ్య భూషణుడు, ఆఖరి న్యాయం, అంత్యారంభాల అంచున, అస్తమయం, సాలెగూడు..." ఇలా అనేక కథలు శతాబ్దాలు మారినా, తరాలు మారినా ప్రణాళికల పేరుతో ఎన్నెన్ని ఆర్థిక విన్యాసాలు జరిగినా వీసమెత్తు కూడా ప్రగతికి నోచుకోని కష్టజీవుల కథలకు నిండైన కథా శిల్పంతో, సొగసైన శ్రీకాకుళం మాండలికంలో రెడ్డిశాస్త్రి అక్షరరూపం కల్పించారంటారు కోడూరి. ఇందులో రెడ్డిశాస్త్రి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివరాలు చాలా తక్కువ.

1970 దశకంలో రచన ప్రారంభించిన కొందరు మంచి రచయితలలో వివిన మూర్తి ఒకరంటారు వల్లంపాటి వెంకట సుబ్బయ్య. రామాపురం అనే చిన్న పల్లెలో పుట్టిపెరిగి మహానగరమైన బెంగుళూరులో చాలా కాలంగా జీవిస్తోండడంవల్ల తనకు లభించిన ఈ రెండు ప్రత్యేక సౌకర్యాలను నిజాయితీతో, చాతుర్యంతో ఉపయోగించుకొని మూర్తి కథా వస్తువుల్ని ఎన్నుకొంటున్నారని అంటారు వల్లంపాటి. మూర్తి కథా సంపుటాలు-'ప్రవాహం, దిశ' రెండిటిల్లోనూ ఇరవైనాలుగు కథలున్నాయి. సంపుటాల్లోకి రానివి మరో వంద ఉంటాయి. 'వంకర చూపులు, ముంజలు' వంటి కథల్లో వివినమూర్తి దిగువ మధ్యతరగతి కుటుంబజీవనం,

ఆర్థిక సంబంధాలు ఎలా మారుతున్నాయో విశదీకరించారు. సామ్రాజ్యవాద భావజాలాన్నీ, భారతీయ పాశ్చాత్య సంస్కృతుల్లో దాని చరిత్రనీ, దాని భవిష్యత్ పరిణామాలను మూర్తి తన కథల్లో చిత్రించారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ భారతీయ సమాజంలోకి తీసుకొచ్చిన పరిణామాలను మూర్తి తన కథల్లో నిశితంగా విశ్లేషించారని వల్లంపాటి గారు భావించారు. "వస్తువుకు తగిన శిల్పాన్ని ఎన్నుకోవటంలో కూడా వివిన మూర్తికి చాలా శ్రద్ధ, అన్వేషణ ఉన్నాయి. అతని సాధారణ కథన పద్ధతి వాస్తవిక చిత్రణే. అతడు రాసిన చాలా ఎక్కువ కథలు ఈ కథన శిల్పంలోనే ఉన్నాయి -" అనే వల్లంపాటి " ఈనాడు మనకున్న అరుదైన రచయిత వివినమూర్తి. కొత్త చూపు కలిగిన ఆలోచనాపరుడు. జీవితం పట్ల గౌరవమూ , సాహిత్యం పల్ల నిబద్ధతా ఉన్నవాడు" అంటూ కితాబునివ్వడమేకాక, వాటిని తన సమీక్షలో నిరూపించాడు.

*తొలి కథ నుంచీ సంచలనం సృష్టించిన కథకులు అల్లంరాజయ్య* వ్యాస రచయిత ఎన్.వేణుగోపాల్ రాజయ్య కథా కథన వైవిధ్యాన్ని సమర్థవంతగా ఆవిష్కరించారు. "గ్రామీణ భౌతిక, మానసిక ప్రపంచాల చిత్రణ రాజయ్య కథల వస్తువుకూ, శిల్పానికీ కూడ వర్తిస్తుంది. నిజానికి చాలా కథలలో వస్తు శిల్పాల విభజన కూడ సాధ్యం కాదు. రాజయ్య ఎంచుకున్న లాంటి వస్తువులను, రాజయ్య చెప్పిన శిల్ప నిర్మాణ పద్ధతులలో, భాషలో కాకుండా మరొక రకంగా చెప్పడం సాధ్యమవుతుందా అని ఆలోచిస్తే ఈ కథల వస్తు శిల్పాల మమేకత ఎంత సహజమైనదో, ఎంత దృఢమైనదో అర్థమవుతుంది. రాజయ్య కథలలో వస్తువు చాలా వైవిధ్యభరితమైనది. స్థూలంగా చూస్తే ఈ కథలన్నీ పోరాటం అనే ఒక వస్తువును ఆశ్రయించినట్లు కనబడతాయి.ఈ స్థూల దృష్టినుంచి మాత్రమే చూసినందువల్లనే రాజయ్య కేవలం పోరాట ప్రచార కథలు మాత్రమే రాశాడని, ప్రజా జీవిత నిర్దిష్టతను గమనించలేదని ఆయన మీద విమర్శలు వచ్చాయి. కానీ ఆ కథలను జాగ్రత్తగా ఏ దురభిప్రాయాలు లేకుండా చదివితే పోరాట జీవితం అనే ఒకే వస్తువునే రాజయ్య ఎన్ని వేల కోణాలనుంచి దర్శించాడో, ఆ ఒకే వస్తువు ఎన్ని ముఖాలలో వ్యక్తీకరణ పొందుతుందని గుర్తించాడో, ఆ వస్తువును వందల కథాంశాలలో ఎంత మౌలికంగా, సృజనాత్మకంగా అన్వయించాడో అర్థమవుతుంది" అంటూ వేణుగోపాల్, అల్లంరాజయ్య తొలి కథ 'ఎదురు తిరిగితే ' మొదలుకుని 'గురువులు', అతడు....ఇలా నూటయాభై కథల్లోని వస్తు విశిష్టతను గుర్తించడానికి ఐదు ప్రాతిపదికలను గుర్తించారు. ప్రజల మధ్య వైరుధ్యాలు, కథాంశపు చరిత్ర-భూగోళాల గురించిన స్పష్టత, కథాంశపు నిర్దిష్టత, పాత్రల మూలాలను బాహ్య పరిమాణాల నుంచి, అంతర్గత చలనం ద్వారా చూపగలగటం వంటి ప్రత్యేకతలతో రాజయ్య ఇతివృత్తానికి సంబంధించి చిన్న అంశాలను కూడా వదలక కథలకు శ్రవ్య, దృశ్యలక్షణాలు కల్పించారని వేణుగోపాల్ వివరించారు. వస్తువులోనూ, శిల్పంలోనూ, కథన పద్ధతులలోను, భాషా సంప్రదాయంలోనూ జీవిత చిత్రణలోనూ, సున్నితత్వంలోనూ అద్భుతమైన, అసాధారణమైన విజయాలెన్నో రాజయ్య సాధించారంటూ పేర్కొన్న వేణుగోపాల్ కథకుడి వ్యక్తిగత జీవితానికి సంబంధించి కనీస సమాచారం కూడా ఇవ్వలేకపోవడం లోటుగా కనబడుతుంది.

వుప్పల నరసింహం కథలు చదువుతుంటే తెలంగాణా గ్రామాల స్థితిగతులు దృశ్యమానమవుతాయి- అనే సమీక్షకులు డా.కాలువ మల్లయ్య, వుప్పల జీవిత నేపథ్యం ప్రస్తావించి, తెలంగాణా ఆశు సంప్రదాయంలోంచి వచ్చిన రచయితగా వుప్పలను పేర్కొంటారు. 'ముద్ర' సంపుటిలో వుప్పల కథల్ని ప్రస్తావిస్తూ తెలంగాణా

గ్రామాల్లోని భూస్వామ్య శక్తుల దాష్టీకాన్ని, ఫ్యూడల్ భావాల దుర్మార్గాన్ని కళ్ళారా చూసిన అనుభవంతో వుప్పల కథలు రాశారంటారు. " ఎర్రలైటు, బియ్యం, అనామకురాలు, ఊబి, నా రక్తమే నా రిక్షాకు పెట్రోలు, పిండం, కన్నీటి పడవ, బువ్వ, ఇత్తనపు కోడె, దండాపి.." వంటి ఎన్నో కథల్ని విపులంగా సమీక్షించారు. తెలంగాణా పల్లెల్లో పట్వార్లు, పటేళ్ళు, దొరలు, పోలీసులవంటి చిల్లర దేవుళ్ళ దౌర్జన్యాలను వుప్పల తన కథల్లో ఎండగట్టారంటారు మల్లయ్య. వుప్పల కథలు నడుస్తున్న కొద్దీ కడుపులో పేగులను మెలికలు తిప్పి గుండెను కోత పెడతాయి. కన్నీళ్ళతో ఆగ్రహం కూడా కలుగుతుంది. సజీవమైన పలుకుబడులతో కథల్ని వుప్పల పోరాటానికి ఆయుధాలుగా మలిచారంటారు మల్లయ్య.

సి.సుజాత కథల గురించి కల్పన రెంటాల రాసిన వ్యాసం తరువాతది. నూటికి పైగా కథలు, 124 నాటికలు, ఒక నవల ద్వారా తెలుగు పాఠకులకు, పత్రికారచయిత్రిగా పత్రికాపాఠకులకు చిరపరిచితురాలైన సి.సుజాత 'సుజాత కథలు', "రెప్పచాటు ఉప్పెన" అనే రెండు సంపుటాలు ప్రచురించారు. "ఈ కథలన్నిటినీ చదివితే ధ్వంసమైపోతున్న మానవ విలువల పట్ల, డబ్బు చుట్టూ అల్లుకొంటున్న సమాజ సంబంధాల పట్ల, రకరకాల స్థాయుల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న బహిరంత సంఘర్షణల పట్ల ఓ రచయిగా తనకున్న సామాజిక బాధ్యత ఏమిటో గుర్తెరిగి రాసిన కథలన్న సంగతి అర్థమవుతుంది అంటారు కల్పన. తొలినాటి సుజాత కథలకు, ఆ తర్వాత వచ్చిన కథలకు ఉన్న తేడా గమనిస్తే రచయిత్రుల ఆలోచనా విధానంలో వచ్చిన మార్పు, స్త్రీ వాద దృక్పథం తెచ్చిన ప్రభావం ఆమెపై బలంగా పడిందని కల్పన నిరూపించే ప్రయత్నం చేశారు. నీడ, నేనొక్కదాన్నే, పంజరం, స్లైల్ ఫర్ సేల్, నివురు...వంటి కతలు ఎందుకు గొప్పవయ్యాయో కల్పన విశ్లేషించారు. భిన్నమైన ఇతివృత్తాలతో, చదివించే శైలి, వాస్తవానికి దగ్గరగా, సహజంగా ప్రవర్తించే పాత్రలతో సృజించిన కథల ద్వారా బలమైన ముద్రతో వర్ధమాన రచయిత్రులకు మార్గదర్శకం కాగలిగారని కల్పన సుజాతను పేర్కొనడం గమనార్హం.

రాయలసీమ మూడోతరం తెలుగుకథకుల్లో చిలుకూరి దేవపుత్ర ఒకరంటారు సమీక్షకులు మధురాంతకం నరేంద్ర. "దాదాపుగా దేవపుత్ర కథా సాహిత్యానికంతా దళిత జీవనమే కేంద్రం. పాత్రల కులమేమిటో పేర్కొన్న అయిదారు కథలలో మాత్రమే గాకుండా మిగిలిన కథలలో గూడా ప్రధాన పాత్రలు దళితులేనన్న విషయం నిర్వివాదాంశం. ఆయన కథలలోని పాత్ర సామాజిక జీవగమనమూ, వాళ్ళ మానవసంబంధాలు, ఆచారవ్యవహారాలు, వాళ్ళకూ అగ్రకులాల వాళ్ళకూ మధ్య యేర్పడే విభేదాలు, వాళ్ళ ఆచూకీని పాఠకుడికి పట్టి చూపుతాయి" అనే నరేంద్ర, చాలా కథలలో దేవపుత్ర సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక అంశాలను "చూపే కథల పద్ధతిలో కాక చెప్పే కథల" పద్ధతిలో రాశారంటారు. సమకాలీన సమాజపు అన్ని పార్శ్వాలనూ తన కథల్లో నిక్షిప్తంచేసిన దేవపుత్ర విలక్షణమైన కథకుడే కాదు, పరిణతి సాధించిన కథకుండంటారు. అలాగే కొన్ని కథల్లో కథా శిల్పం పట్ల శ్రద్ధ వహించి ఉంటే అవి ఇంకా మంచి కథలయ్యేవని కూడా అంటారు.రచయిత వ్యక్తిగత వివరాలను సంక్షిప్తంగా అక్కడక్కడా పొందుపరచారు.

ఉత్తమ వ్యంగ్య కథకుడిగా మన్ననలందుకొన్న తోలేటి జగన్మోహనరావు రెండు కథాసంపుటాలు జగన్మోహనరావు కథలు, లక్ష్మీ కటాక్షం ఆధారంగా రెంటాల, తోలేటి దృక్పథం సాహిత్యాలను విశ్లేషించారు. "1967-71 ప్రాంతంలో నక్సల్‌బరీ, శ్రీకాకుళ పోరాటాల ప్రభావంతో అతివాద రాజకీయాలవైపు ఆకర్షితుడేన తోలేటి, ఆ తరువాత "హాస్యరచనలు చేశారు. హాస్యరచనలను వర్గ ద్రోహం" అనుకొన్న

దశనుంచి 'వయసుతో, అనుభవంతో' అతివాద భావాల తీవ్రత తగ్గిన దశకు ప్రయాణించారు.అలాంటి సమయంలో ఆయన యాదృచ్ఛికంగా పి.జి. ఓడ్ హావుస్ రచనలు చదవడం, వాటితో ప్రభావితం కావడం తటస్థించింది. ఆ ప్రభావం ఆయన మీద అపరిమితంగా పడిందనడానికి ఆయనకంటూ ఇప్పుడు ఓ ప్రత్యేకమైన పేరే తెచ్చి పెట్టిన హాస్య, వ్యంగ్య కథలే సాక్ష్యం" అనే రెంటాల తోలేటి కథల్ని "సమకాలీన సమాజం-రాజకీయాలు రచనలు-రచయితలు, మూఢభక్తి - భక్తి వ్యాపారం, వామపక్ష భావజాలం, కెమెరాగా కలం, వస్తు వైవిధ్యం-వ్యంగ్యం వైభవం, మగవాద వివాదాలు..." కింద విశ్లేషించారు. హాస్య వ్యంగ్య ధోరణిలో ఆయన సమకాలీన సమస్యలను చిత్రించిన తీరును రెంటాల జయదేవ నిశితంగా విశ్లేషించారు.

తెలుగు జాతి సంపద అనదగిన కథలు రాసిన నామిని సుబ్రహ్మణ్యం నాయుడు కథలపై స్వామి సమీక్ష చాలా సంగ్రహంగా సాగినా ఆలోచనాత్మకంగా సాగింది. నామిని రచనల్లో 'పచ్చనాకు సాక్షిగా' కతలకు అమ్మ కేంద్రం! 'సినబ్బ కతలకు' హైస్కూలు కేంద్రం, 'మిట్టూరోడి కతలకు' ఊరు కేంద్రం. కేతు విశ్వనాథరెడ్డి, సింగమనేని లాంటి రచయితల పుణ్యమా అని ఆర్థిక కోణం గడప వరకూ వచ్చి ఆగి పోయిన రాయలసీమ రైతు జీవితాన్ని సామాజిక సాంస్కృతిక వైశాల్యాలకు విస్తరింపజేసినవాడు నామిని. రాయలసీమ సాహిత్యానికి అతడు ప్రత్యేకమైన మలుపు. మధ్యతరగతి వారి పట్టణీకరదృష్టి, బ్రాహ్మణుల సంస్కృతీ తెలుగు కథను దశాబ్దాలుగా పరిపాలించిన నేపథ్యంలో - భారతీయ పల్లె సమాజంలో అధికారిక జనసమూహాలకు ప్రాతినిధ్యం వహించే శూద్ర సంస్కృతినీ, శూద్ర సంస్కృతిలోని పనివేదాన్నీ, శూద్రుల కుటుంబ సామాజిక జీవితాన్నీ, మతానికి సంబంధించిన శూద్రుల భావ ప్రపంచాన్నీ యథాతథంగా ఆవిష్కరించిన అద్భుత కథకుడు నామిని. పల్లె జీవితంలోని జీవనోత్సాహం నామిని కథల్లో స్పష్టం " అంటారు స్వామి రచయిత కంటే జీవితం గొప్పదని రుజువు చేసిన రచయిత నామిని' అని కొనియాడుతారు స్వామి. స్వామి వ్యాసం రచయిత పైన తనకున్న ఆరాధనను పట్టి చూపుతుంది. అయితే మరి కొంత విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా వుంటే పాఠకకులకూ, రచయితకూ మరి కాస్త మేలు జరిగేది.

ఒకప్పుడు మధురాంతకం అనగానే మూడు పేర్లు గుర్తొచ్చేవి. నిత్యవసంతంగా పూత. పిందె కాయలతో ఉన్న అంటు మామిడి చెట్టు వంటి రాజారాం ఉన్న తోటలోనే మహేంద్ర, నరేంద్రలు.... తెలుగువారి దురదృష్టం ఇప్పుడు ఒక్కరే ఉన్నారు. అయితేనేం తండ్రి వారసత్వం, సహృదయత, ఆంధ్రాంగ్ల సారస్వతాల అవగాహన, హాస్య ప్రియత్వం, సామాజికత ఇవన్నీ నరేంద్రను కథకుడి గానే కాదు, తండ్రి కన్నా భిన్నమైన కథకుడిగా, రాయలసీమ.. ముఖ్యంగా చిత్తూరు  జిల్లా మాండలీకాల్ని జీవితాల్ని మనోహరంగా చిత్రించగల విస్తృత రచయితగా తీర్చిదాద్దాయి. నరేంద్ర వ్యక్తిత్వం, సాహిత్యాన్ని దాదా హయత్ సమీక్షించడం విశేషం. దాదాహయత్ మాటల్లో చెప్పాలంటే - నరేంద్ర "తన తొలి కథల్లో ఒకటైన 'కేంద్రం లేని వృత్తం' లోనే కులమతాల అంతరాల్ని పెద్ద దెబ్బ" కొట్టారు. నరేంద్రది సంస్కరణాభిలాష. "గుబ్బమూ-కళ్ళెమూ, తియ్యటి శాపం, మిత్ర, కాకులు-గ్రద్దలు, అత్యాచారం, నాలుగు కాళ్ళ మండపం, నిత్యమూ నిరంతరమూ, జాతరలో వేషధారి, గమనం, కుంభమేళా....." వంటి కథల్లో ఉన్న ఇతివృత్తాలు, శిల్పనైపుణ్యం, రచయిత అంకితత్వం వంటి వాటిని హయత్ విశదీకరించారు. "నరేంద్ర కథలు పెద్దవి. కాళీ పట్నం రామారావు మాస్టారులో కనిపించే విస్తృతి, పరిశీలనాశక్తి" నరేంద్ర కథల్లో కనిపిస్తాయంటారు. పాత్రల చేత మాట్లాడించడం ద్వారా ఆయన కథ నడిపించినట్లే, మాట్లాడించకుండా కూడా కథ నడిపిస్తారంటారు హయత్.

ఎ.అప్పలనాయుడు గురించి వివినమూర్తి రాసిన సంక్షిప్త వ్యాసంలో ఆయనకు జననాట్యమండలితో వున్నసంబంధాన్నీ, అది ఆయన రచనలపైన నెరపిన ప్రభావాన్నీ నిరూపించి చూపుతారు. తొలి కథ 'పువ్వుల కొరడా'లోనే వెట్టిచాకిరిపై నాయుడు కొరడా ఝుళిపించారు. "నాయుడు తొలి కథల్లో ఆవేశం కనిపిస్తుంది. అలా అని ఆయన ఒక్క కథ కూడా కాలక్షేపానికి రాయలేదు" అంటూ వివినమూర్తి నాయుడు తర్వాతి కథలైన 'ఓ తోట కథ, తల్లీ కూతుళ్ళు, డోర్ డెలివరీ, యాన గాలి, బంధాలు-అనుబంధాలు, ప్రత్యామ్నాయం'లో ఉన్న ప్రత్యేకతల్ని విశదీకరించారు. అప్పలనాయుడు కథల్లో విశిష్టమైనది 'యానగాలి' అనే వివినమూర్తి, 'శ్రీకాకుళపు మాండలికంపై, నుడికారంపై గొప్ప అధికారాన్ని సంపాదించుకున్న 'అప్పలనాయడు ఈ జీవితాన్ని శాసిస్తోన్న, అందులో మార్పులు తెస్తోన్న రాజకీయాలపై దృష్టి సారించారంటారు.

తెలంగాణ అగ్ర కథల్లో ఒకరైన తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథా సాహిత్యాన్ని పినాక పాణి సమీక్షించారు. రెడ్డి కథల్లోని వస్తు వైవిధ్యాన్ని కథన పద్ధతిని తెలంగాణలో 1980 ల నుంచీ కొనసాగుతున్న విప్లవోద్యమ నేపథ్యం నుంచి చూడాలనే పినాకపాణి, "ఉరి, చావువిందు, పనిపిల్ల, జాడ' వంటి కథలను తీసుకొని తుమ్మేటి కథన నైపుణ్యాన్ని వివరించారు. "తెలంగాణా గ్రామాల్లో ఆదివాసీ, కార్మిక జీవితాలను, వాళ్ళ జీవన్మరణ పోరాటాలను, హత్యలను, ఆత్మహత్యలను కథల్లోకి ఎక్కించే ప్రయత్నాలను, వర్గపోరాటం మానవసంబంధాలన్నిటిలో ఎన్నెన్ని రూపాల్లో ప్రతిఫలించేందుకు అవకాశం ఉన్నదో ఒక సృజనకారుడిగా అన్వేషించి చిత్రించగలిగారు. రాజ్యం ఒక అణచివేత సాధనమైన ఈ సమాజంలో ఆధిపత్యం, హింస లెక్కలేనన్ని వికృత రూపాల్లో పెచ్చరిల్లి ఒక అమానవీయ విధ్వంస క్రమంలోకి మనిషిని నెట్టివేస్తుంది. ఈ క్రమం మానవ సంబంధాల్లో అనేక అవ్యక్త హింసా వ్యవస్థలను ప్రోది చేస్తుంది" అంటూ రెడ్డి కథకుడిగా సాధించిన విజయాలను ప్రజాపోరాటాలకు ఆశ్వాసంగా నిలిచి ఉంటాయనడం గమనార్హం. రఘోత్తమరెడ్డి గురించి ప్రాథమిక సమాచారం కూడా లేకపోవడం వల్ల అదో లోపంగా ఉంది.

బండి నారాయణస్వామి కథా సాహిత్యాన్ని గుడిపాటి విశ్లేషించారు. స్వామి కథా సాహిత్యంలో నాలుగు అంశాలను గుడిపాటి గుర్తించారు. - తాత్త్విక నేపథ్యం నుంచి జీవితాన్ని చిత్రించినవి, రాయలసీమ జీవితాన్ని రికార్డు చేసినవి, మధ్యతరగతి జీవితాలకు సంబంధించినవి,దళిత జీవితపార్శ్వాల్ని వ్యక్తం చేసినవి. స్వామి విస్తృత కథకులు. చమ్కీదండ, నీడల ముడులు , అధోముఖం, అమ్మ, ఒక హెచ్.సరస్వతి, బతుకుఊబి, వానరాలే, నీళ్ళు, చావుకూడు మొదలైన ఆయన ప్రసిద్ధ కథలలోని వస్తు శిల్పాలను గురించి గుడిపాటి చర్చించారు.

"స్వామి తన కథల్లో బాల్యాన్ని, మాతృత్వాన్ని, అద్భుతంగా కవితాత్మక శైలిలో చిత్రించారు" అంటారు గుడిపాటి. స్వామి కథలు స్వామి కథలు జీవితంలోని విశాలత్వాన్ని, వైవిధ్యాన్ని ప్రతిఫలించాయి. బీభత్సాన్నీ, విషాదాన్నీ, హింసనీ, ఘర్షణనీ, మూసల్లో ఒదిగి కునారిల్లిపోయే మనుషుల నైజాన్ని రచయిత చెబుతూనే జీవితాల్ని మలచు కొనే మార్గాలేమిటో కూడా సూచిస్తారని గుడిపాటి అభిప్రాయపడ్డారు.

"జీవని" తొలి కతల సంపుటితో ప్రసిద్ధుడైన వి.చంద్రశేఖరరావు ఒక స్వతంత్ర శైలిని రూపొందించుకున్న కథకుడంటారు తిరుపతిరావు. 'జీవని, లెనిన్‌ప్లేస్" వంటి కథా సంపుటాల్లో ఉన్న "ఆకాశంలో సగం, ఆనందశంకరం, మహాకవి మరణం, ముఖాముఖం, లెనిన్ ప్లేస్, మోహనా! మోహనా!" వంటి కథలన్నీ సంఘటన ప్రధానంగా కాక, పాత్రల ప్రధానంగా సాగుతాయి. తిరుపతిరావు మాటల్లోనే చెప్పాలంటే -

"చంద్రశేఖరరావు కథల్లో సంఘటనలు ఉన్నట్టు కనిపించినా అవి కథల్లో నేపథ్యానికి సంబంధించినవిగానే ఉంటాయి. గత సంఘటనల పాత్రలు "ఫేట్"ని నిర్దేశిస్తూ ఉంటాయి. చాలా వరకు పాత్రలు ఒకానొక 'గిల్ట్'తో సంచరిస్తూ ఉంటాయి.జ్ఞాపకాల్ని ట్రామాల్లాగ భరిస్తూ ఉంటాయి. ఎక్కడో ఆత్మిక ప్రపంచపు లోతుల్లో ఏదో అస్పష్టమైన వేదనని దేన్నో మోస్తూ ఉంటాయి. సంవేదన సంక్లిష్టతలో సంచరిస్తూ ఉంటాయి. కొన్ని పాత్రలు ఏదో ఒక అసాధారణ చైతన్యానికి బాధితులయినట్లు అనిపిస్తుంది." అయితే జీవని'లో కథలకి, 'లెనిన్ ప్లేస్'లో కథలకి వస్తురూపాల్లో తేడా కనిపిస్తుందంటారు తిరుపతిరావు. ఆయన చంద్రశేఖర రావు కథలు, పాత్రలు తీసుకొని విడివిడిగా చర్చించి ఉంటే యీ వ్యాసం మరింత ప్రయోజనాత్మకంగా తయారయి ఉండేది.

శాంతినారాయణ కతల్ని రాచపాళెం చంద్రశేఖరరెడ్డి పరిచయం చేశారు. 1974లోనే శాంతి నారాయణ 'రక్తపు ముద్ద పిలిచింది' అనే అయిదు కథల సంపుటి ప్రచురించారు. తర్వాత'రస్తా' పల్లేరుముళ్ళు, నమ్ముకున్న రాజ్యం అనే కథా సంపుటాలు వచ్చాయి. శాంతినారాయణ "అనంతపురం జిల్లా నిర్దిష్ట జీవితాన్ని గురించి రాస్తూనే, మొత్తం సమాజంలోని ఇతర సమస్యల గురించి కూడా రాస్తున్నారు. ఏ వస్తువును తీసుకున్నా అనంతపురం జిల్లా నేపథ్యం లోనే రాశారు. ఈయన కథల్లో సీమ వ్యవసాయ రంగం, స్త్రీ పురుష సంబంధాలు, అస్పృశ్యత, ఆర్థిక అవినీతి, విద్యావిలువల పతనం వంటివి వస్తువులుగా కనిపిస్తున్నాయి" అంటారు రాచపాళెం. "వ్యవసాయరంగంలో చిన్నప్పటినుండి సునిశిత సంబంధం గల శాంతినారాయణ 'అనంత' రైతు జీవనశైలిని, ఆలోచనల్ని, ప్రకృతిలో వచ్చే మార్పులు అవి వ్యవసాయం పై చైపే ప్రభావం, వ్యవసాయ రంగాన్నిఆవరించిన అనేక ప్రభుత్వరంగ సంస్థల తీరు తెలన్నులు వంటి వాటిని అనుభవపూర్వకంగా పరిశీలనాత్మకంగా తన కథల్లో చిత్రించారు. శాంతినారాయణ కథల ఇతివృత్తాలను, కొన్ని పాత్రలను విశ్లేషిస్తూ రాచపాళెం ఆయన కథల్లో కనిపించే కొన్ని అభిప్రాయాలు, ప్రశ్నలు ఎలా పాఠకుల్ని ఆందోళనకు గరిచేస్తున్నాయో కూడా సోదాహరణంగా విశ్లేషించి చూపెడతారు.

తన తొలి కథ 'అహింస' నుంచీ దాదా హయత్ నేటి వరకూ సాగించిన కథా ప్రస్థానాన్ని గుడిపాటి సమీక్షించారు. ఎంతో సాదా, సీదా అంశాన్ని సైతం హృదయానికి హత్తుకునేలానే కాక చైతన్యాత్మకంగా చెప్పగల ప్రతిభ దాదాహయత్‌దని గుడిపాటి అంటారు. "మురళి వూదే పాపడు, మసీదు పావురం, ఎడారి సేద్యం, ఎల్లువ, ఏటి ఒడ్డు చేపలు, వారసత్వం, సెగ మంటలు, ప్రసూతి వార్డు, రెండణాల గుగ్గిళ్ళు, ఆశీర్వాదం, కోరిక, ప్రదర్శన..." వంటి కథల ఇతివృత్తాలను వివరిస్తూ గుడిపాటి "దాదాహయత్.. శిల్పం పట్ల అమిత శ్రద్ధ కనబరుస్తారు. ఏం చెప్పాలన్నదే కాదు, ఎలా చెప్పాలన్నది కూడా ఆయన సీరియస్‌గా పట్టించుకుంటారు" అని అంటారు.

వి.ఆర్.రాసాని అనే కలం పేరుతో రాసే రాసాని వెంట్రామయ్య కథల గురించి రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రాశారు. "కింది మధ్యతరగతి వృత్తి కులానికి చెందిన రాసాని సమకాలీన సామాజిక వాస్తవికతను జానపద సాంస్కృతిక నేపథ్యంలో సరళమైన కథా సంవిధానంతో, సుందరమైన చిత్తూరు జిల్లా స్థానిక భాషలో చిత్రిస్తూ చాలా కథలు రాశారు. రాసానిపై, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, డా.పి.కేశవరెడ్డి వంటి సీనియర్ రచయితల ప్రభావం ఉందంటారు విమర్శకుడు.తన తొలి కథ 'మధురక్షణం' నుంచే ఆయన "వాస్తవ జీవిత చిత్రణకుపక్రమించారు. ఊహల్ని వదిలిపెట్టి ఉన్న జీవితాన్ని రాయడానికి పూనుకున్నారు.

కాకాతాళీయతను విస్మరించి సంభవనీయతకు పట్టం కట్టారంటారు చంద్రశేఖరరెడ్డి. రాసాని శిల్పంగారడీలతో పాఠకులను దూరం చెయ్యకుండా, వస్తువుకు ఒదిగి ఉండే శిల్ప సహకారంతో తన కథలతో పాటు తానూ పాఠకులకు "దగ్గరయిన అంశాలను విమర్శకుడు ఈ వ్యాసంలో సోదాహరణంగా వివరించారు.

ఉత్తరాంధ్ర కథకుల్లో గంటేడ గౌరునాయుడు గరించి తెలియని వారుండరు. ఆయన మీద మరో కథకమిత్రుడు ఎ.అప్పల్నాయుడు రాయడం విశేషం. ఆయన మాటల్లోనే చెప్పాలంటే-"గౌరునాయుడ్ని దగ్గరగా, సహచరుడిగా, స్నేహితుడిగా యెరిగిన నేను అతనిని గ్రామీణ జానపద కథకుడిగానూ, మంచిని కోరే రచయితగానూ, ప్రాంతీయ, ఆర్థిక, సామాజిక జీవిత చిత్రకారుడిగానూ, అతని కథల ద్వారా అర్థం చేసుకున్నాను. ఆయన రాసిన, దాదాపు యేభయి కథల్లో ఆయనే కొన్నింటిని ఆదిలో రాసిన వాటిని- యిపుడు ప్రస్తావించడు. 1984 లో తొలికథ 'శారదపెళ్ళి', 'కథాంజలి' (మద్రాస్) పత్రికలో అచ్చయ్యింది. నాలుగగైదేళ్ళ పాటు, 'కథాంజలి' లోనూ, మరో పత్రికలోనూ మరో నాలుగైదు కథలు అచ్చయ్యాయి. గానీ వొక అవగాహనతో, వొక ఆకాంక్షతో, వొక ఆర్తితో...కథలు రాయాలన్పించి 1989లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో 'విముక్తి' కథతో తాను కథకుడిగా అయ్యానని చెప్పకుంటాడాయన... యే హంగూ, ఆర్భాటమూ లేకుండా, నేల పొత్తిళ్ళలోంచి తలెత్తి, చిరుగాలికి పులకించే మొలకుల్లా, గౌరునాయుడు, గౌరునాయుడు కథలూ వుంటాయి..." అప్పల్నాయుడు గౌరునాయుడి 'ఏటిపాట' కథా సంపుటిలోని పదహారు కథలను, కథాంశాల్ని, కథనరీతులను విశ్లేషించారు. "తన చుట్టూ వున్న జీవితాన్ని జీవిస్తూ, ప్రాంతాన్ని ప్రేమిస్తూ, అవించనీయ పరిణామాలను ప్రశ్నిస్తూ, గతవర్తమానాలను దర్శిస్తూ కళింగాంధ్ర ఉచ్ఛ్వాస, నిశ్వాసాలకు కథనం జేస్తున్న అపురూప కథకుడు గౌరునాయుడు..." అనే అప్పల్నాయుడు గౌరునాయుడు గురించి మరికొంత వ్యక్తిగత సమాచారం పొందు పరచి ఉంటే బాగుండేది.

బమ్మిడి జగదీశ్వరరావు 'రెక్కలగూడు' పిండొడిం, మట్టి తీగలు" అనే మూడు కథల సంకలనాలు ప్రచురించారు. "మొదటి సంపుటం 'రెక్కలగూడు'లో బజరా ప్రధానంగా స్త్రీల జీవితాలను స్పృశించారు. ఆ జీవితాలలో గూడు కట్టుకుని ఉన్న హింసనూ, దుఃఖాన్నీ, అభద్రతనూ విప్పి చెప్పాడు" అంటూ ఒక్కో కథలో బజరా ఏయే అంశాలను ప్రస్తావించరో సమీక్షించారు ఓల్గా. బజరా కథలు ప్రతి స్త్రీ ఏదో ఒక స్థాయిలో హింసకు గురవుతోందనీ, పైకి స్త్రీలకు సహాయపడుతున్నట్లు కన్పించే పద్ధతుల వెనకాల ఎప్పటికీ స్త్రీలను పరాధీనులుగా చేసే కుట్ర ఉందనీ, ఫ్యాక్టరీలలో కార్మికులు, పొలాల్లో రైతులు పడే కష్టాలు, ప్రభుత్వాల నిర్బంధాలు, ఆర్థికవిధానాల వల్ల నగరాలకు వలసపోతున్న ప్రజలు, వలస ప్రజలు ఎదుర్కొనే సమస్యలు, వస్తు వ్యామోహం, పరాయీకరణకు గురవుతున్న ప్రజల సమస్యలు... ఇవన్నీ 'బజరా' కథల్లో ఉంటాయంటారు ఓల్గా. - " రెక్కల గూడు, ఎర్ర కలువ, లక్కపిడతలు, మొదలైన కథలను ప్రస్తావిస్తూ ఓల్గా - "సమాజంలోని సకల విషయాలనూ నడిపించే సామాజిక చలన సూత్రాలను అర్థం చేసుకున్న వారు రచయితలైతే వారికి భాష మీద పట్టు ఉంటే తమ చుట్టూ ఉన్న జీవితాల్ని గమనించే ఓపికా తీరికా ఉంటే ఎలాంటి మంచికథలు రాయొచ్చో బజరా కథలు నిరూపిస్తాయి' అంటారు. ఈ వ్యాసంలో మరికొన్ని కథల ప్రస్తావన, రచయితకు సంబంధించిన కొన్ని వివరాలైనా ఉంటే సంపూర్ణంగా ఉండేది.

స్త్రీవాద సాహిత్యంలో అంతర్భాగమై, ఆ చేతనతో సాహిత్య సృజన చేస్తున్న రచయిత్రి కుప్పిలి పద్మ రచనలను

బి.తిరుపతిరావు పరిచయం చేశారు.పదకొండు కథలున్న 'సాలభంజిక' కథాసంపుటంలో దాదాపు అన్ని కథలూ స్త్రీ పురుష సంబంధాలలో చాలా సున్నితాంశాలకు సంబంధించినవి. అయితే ఈ సున్నితాంశాల వెనుకనున్న దారుణాన్ని, దానికి కారణమైన పితృస్వామ్య ఆలోచనా ధారని ఈ కథలు బహిర్గతం చేస్తాయి." అనే తిరుపతి రావు "పాత్రల పరంగా చూసినప్పుడు కుప్పిలి పద్మ పాత్రలు కొన్ని హఠాత్తుగా వాటి చైతన్య స్థాయిని పెంచుకుంటాయి. ఫలితంగా అవి తమ పరిధులకు మించి ప్రవర్తిస్తుంటాయి." అంటారు. ప్రేమ చుట్టూ ఉన్న భ్రమల్ని ఛేదించడం, వ్యవస్థని వ్యతిరేకించడం వంటి అంశాలున్న కథల్ని పేర్కొంటూ సమీక్షకుడు "కుప్పిలి పద్మ పాత్రలు చాలావరకు తామున్న స్థితి నుంచి బయట పడడం చాలా సులువు అనే చైతన్యాన్నీ, భ్రమనీ కల్పిస్తాయి..." అన్నారు. వాతావరణ చిత్రీకరణలో రచయిత్రి మెలకువలు పాటించాలంటారు.

'తన కథల పాదాలు నేలమీదా దృష్టి జీవితతత్త్వం మీద ఉండడం వల్లే మహమ్మద్ ఖదీర్ బాబు అనతికాలంలోనే గుర్తింపు పొందాడంటారు కాత్యాయని . దావత్, జమీన్, దర్గా మిట్టకతలు, దూద్ బఖష్ న్యూ బాంబే టైలర్స్, ఖాదర్‌లేడు, పెండెం సోడా సెంటర్ వంటి కథల నేపథ్యంలో అటు ముస్లిముల జీవితాల్నీ, పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం, గ్లోబలైజేషన్ పరిణామాల్నీ, సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావం స్థానిక వృత్తి, వ్యాపారాల మీద ఎలా కమ్ముకుందో ఆ చిత్రాల్నీ ఖదీర్‌బాబు సమర్థవంతంగా తన కథల్లో వివరించారు. "నెల్లూరు జిల్లా ప్రజల జీవిత చిత్రణా, మాండలికభాష యీ కథల చుట్టూ వొక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా యీ కథలు మానవసంబంధాల మీద వొక విశ్వాసాన్నీ, బతుకు పోరాటానికి నైతిక మద్దతునూ అందిస్తాయి. ముస్లిం అస్తిత్వాన్ని అసెర్ట్ చేసుకుంటూ, మెజారిటీ హిందూ సమాజాన్ని సన్సిటైజ్ చేస్తాయి" అనే కాత్యాయని ఖదీర్‌బాబు బలమైన అంశాలను, బలహీనతలను కూడా ప్రస్తావించడం విశేషం.

మధురాంతకం రాజారాం తర్వాత 'తెలుగు కథకులు కథన రీతులు' పుస్తకాల బాధ్యతను చేపట్టిన సింగమనేని నారాయణపై బి.సూర్యసాగర్ రాసిన వ్యాసంతో ఈ సంకలనం సమాప్తమవుతుంది. సింగమనేని అనంతపురం పట్టణానికి దగ్గరలో ఉన్న మారూరు బండమీద పల్లి గ్రామంలో 1943 లో మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టారు. తిరుపతి ప్రాచ్య కళాశాలలో శిక్షణ పొంది ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండితుడిగా పనిచేసారు. ఆయన తొలి కథ 'జూదం'. ఆయన కథలు 'జూదం' 'సింగమనేని నారాయణ కథలు' అనే సంపుటాలుగా వచ్చాయి. సమీక్షకుడి మటల్లో చెప్పాలంటే - అనంతపురం రైతుల జీవితాల్లోని ప్రధాన పార్శ్వాలను తొలిసారిగా సింగమనేని ఆవిష్కరించారు... రైతాంగ పాత్రలు, జీవితం సింగమనేని కథల్లో అత్యంత వాస్తవికంగా, విశ్వసనీయంగా రూపుదిద్దుకున్నాయి.... సింగమనేని విశిష్టమైన ఆరు రైతాంగ కథలు రాసారు -జూదం, అడుసు, ఊబి, ఉచ్చు, విముక్తి, అలజడి. పేర్లు క్లుప్తంగా ఉండి కథల సారాన్ని పట్టిస్తాయి. మొత్తంగా ఈ కథలు అనంత రైతుల స్థితిగతులకు దర్పణం పడతాయి. సింగమనేని 'అవాస్తవికత'లో వాస్తు మౌఢ్యం పై విరుచుకుపడ్డారు. "వాసంత తుషారం, నీకూ నాకూ మధ్య నిశీథి, నిషిద్ధం కథల్లోని స్త్రీ పాత్రలు అద్భుత వ్యక్తిత్వ సౌందర్యానికి ప్రతీకలని సూర్యసాగర్ కొనియాడుతారు. సింగమనేని కథాశైలీ శిల్పాలు, సాహిత్యంలో ప్రజాదృక్పథానికి చెందినవి. ఆయన కథలు ప్రగాఢ జీవితానుభవాన్ని అందిస్తాయి. జీవన ఔన్నత్యానికి కట్టుబడి ఉండే విధంగా మనమీద ప్రభావం నెరపుతాయి. అనంత కథకు ఒరవడి దిద్దడమే గాక తెలుగు కథకు కొత్త ఆవిష్కరణలు జోడించిన వారు సింగమనేని అంటారు సూర్యసాగర్.

ఈ గ్రంథం చివర్లో 'తెలుగు కథకులు-కథనరీతులు" తొలి సంపుటం నుంచి మూడో సంపుటం వరకు ఏయే గ్రంథాల్లో ఏయే కథకులపై ఏయే వ్యాసకర్తలు వ్యాసాలు రాసారో పొందుపరిచారు. తొలి సంపుటంలో కథకుల ఫోటోలు, వారి వ్యక్తిగత వివరాలు చివరి పేజీల్లో పొందుపరిచారు. ఈ నాలుగో సంపుటంలో రచయితల ఫోటోలు లేకపోవడం నిజంగానే వెలితి. కొంతమంది వ్యాసకర్తలు తమ వ్యాసాల్లో కొంత కృషి చేసి కథకుడికి సంబంధించిన వ్యక్తిగత సమాచారం- అంటే పుట్టిన తేదీ, ఊరు, తల్లిదండ్రులు, నేపథ్యం, వృత్తి, ఇతర రచనలు... తదితరాలను పొందుపరిచారు. చాలామంది ఇటువంటి ప్రయత్నం చేయలేదు. తొలి సంపుటంతో పోలిస్తే ఈ సంపుటంలో సమీక్షకులు అంతగా కృషి చేయలేదనిపిస్తుంది. పాపినేని శివశంకర్, వారాలకృష్ణమూర్తి, శ్రీసుభా...ఇలా ఇంకా ఎంతో మంది రచయితల కథనాలపై ఇటువంటి వ్యాసాలు రావలసిన అవసరముంది. అయితే సంపాదకులు దీన్ని 'చివరి సంపుటి' గా పేర్కొనడం గమనార్హం. తెలుగు కథ ఈ వందమందితోనే ఆగిపోదు, ఆగిపోలేదు. కాబట్టి దీన్ని 'చివరి సంపుటి' గా పేర్కొనడం కథకులకు, సాహితీప్రియులకు ఆశాభంగమే. అయితే ఈ గ్రంథంలో ప్రస్తావించిన పాతిక మంది కథకులు, వారి వంద కథలు తెలుగుదేశంలో చోటుచేసుకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలకు ప్రతిబింబాలు అనడంలో సందేహం లేదు. ఈ పుస్తకం చేతిలో ఉన్నా , ఇంట్లో ఉన్నా పాతికమంది గొప్ప కథకులు సృష్టించిన ఎన్నో గొప్ప కథలు..జీవితాలు మన చేతిలో ఉన్నట్లే. ప్రతి పుస్తక ప్రేమికుడి దగ్గరా, ప్రతి గ్రంథాలయంలోనూ తప్పకుండా ఉండవలసిన నాలుగు పుస్తకాలు యివి.

back to book of the week home page

❖ విశేష సమీక్షా వ్యాసం సింగపూర్ తెలుగు సమాజం వదాన్య సౌజన్యంతో అందించబడింది.